# కర్ణుల సైకాలజీ

గంగుల నరసింహారెడ్డి



**తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ ప్రాంగణం ముందర రోజూలానే సందడి సందడిగా వుంది. ప్రసాదం అమ్మే కౌంటర్ల ముందయితే తొక్కి సలాటగా వుంది. నిండా జనం, ఎటు చూస్తే అటు జనం!**

వాళ్ళని జనం అనడం కంటె భక్తకోటి అనడం సబబు కాబోలు. అవును, దేవాలయం దగ్గర భక్తకోటి, దేశం నిండా 'ఆకలి కోటి'! భక్తకోటిలో దయాసాగర్ రావు, ఆకలికోటిలో పీరిగాడు, పెంటడు, ముత్యాలు అక్కడే ఆ జనంలోనే వున్నారు.

దైవదర్శనం పూర్తి చేసుకున్న దయాసాగర్ రావు ఇంటికి తీసికెళ్ళడానికి గాజులు, కుంకుమ, దేవుని పటాలు కొనుక్కునే ప్రయత్నంలో వున్నాడు.

పీరిగాడు, పెంటడు, ముత్యాలు తమ జన్మ హక్కుగా భక్తుల దగ్గర ధర్మం చేయమని అడుక్కుంటు న్నారు.

* * *

''అయ్యా ధర్మం'' దీనంగా అడిగాడు పీరిగాడు.

''లేదు లేదు, వెళ్ళవయ్యా'' విసుక్కున్నాడు దయాసాగర్ రావు.

''మీకు పుణ్యం వస్తుందయ్యా''

''వచ్చింది చాల్లేగాని వెళ్ళవయ్యా''

''మీ పేరు చెప్పకుని లడ్డూ తింటానయ్యా''

''దేశం మీద జనం ఆకలయి చస్తుంటే నీకు తిరుపతి లడ్డూ కావలసి వచ్చిందా, కొత్త కొత్త ప్లాన్లే స్తున్నారు బిచ్చగాళ్ళు లడ్డూ కొరకంటే ఇస్తామని కాబోలు! అవునూ నీ దగ్గర ఎన్ని డబ్బులున్నా యేంటి?''

''ఒక్క పైసా కూడా లేదయ్యా'' అతనెక్కువ మాట్లాడేసరికి పీరిగాడికి ఆశ కలిగింది. ''మీలాంటి వాళ్ళు, దయగల మహారాజులు పావలాయో, అర్థ రూపాయో దానం చేస్తే కొనుక్కుని తింటానయ్యా''

''నయం ఏకంగా మూడు రూపాయిలిమ్మని అడగ లేదు, వెళ్ళవయ్యా వెళ్ళు''

''పోనీ పది పైసలైనా ఇవ్వండయ్యా''

''పది పైసలు కాదు, అయిదు పైసలు కూడా ఇవ్వను వెళ్ళు'' అంటూ పీరిగాణ్ని వదిలించుకుని ముందుకు నడిచాడతను.

* * *

''బాబూ ధర్మం'' అలవాటుగా అడిగాడు పెంటడు.

దేవుని పటం కొనుక్కుంటున్న దయాసాగర్ రావు వెనుదిరిగి అయినా చూడలేదు.

''మీ భార్యాపిల్లలు చల్లగా వుండాలి బాబూ''

పటం కొనుక్కుని ముందుకు నడుస్తున్నాడు దయాసాగర్ రావు.

వెంటబడే నడిచాడు పెంటడు.

''నా దగ్గర మీలాంటివాళ్ళు దానం చేసిన ఈ పైసలున్నవయ్యా, మీరు కూడా పావలా ధర్మం చేస్తే లడ్డూ కొనుక్కుని తింటానయ్యా'' చేతిలోని చిల్లరను చప్పుడు చేస్తూ అడిగాడు.

నిజంగానే వాడి చేతిలో చిల్లరుంది. అది చూశాడు దయాసాగర్ రావు.

''వెళ్ళవయ్యా, పావలాలు, అర్థ రూపాయిలు దానం చేయడానికి నేనేం డబ్బున్నవాడిని కాను.''

''పోనీ మీ చేతనైనంత పది పైసలైనా ఇవ్వండి సామీ'' నిరాశపడకుండా వెంబడిస్తూ అడిగాడు.

''సరే పో'' అని జేబులోంచి అయిదు పైసల నాణెం తీసి వాడి చేతిలో వేసి ముందుకు నడిచాడు.

* * *

''సార్'' పిలిచాడు ముత్యాలు.

ప్రసాదం కొనుక్కోవడానికి వెళ్తున్న దయా సాగర్ రావు తల తిప్పి చూశాడు.

చిరిగినవైనా ఉతికిన బట్టలు ధరించి వున్నాడు ముత్యాలు. దీనంగా వున్నాడు కాని దయనీయంగా లేదు.

దయాసాగర్ రావు తనవైపు చూసేసరికి గుప్పిట తెరిచి చూపించాడు ముత్యాలు. వాడి దగ్గర నలిగిన రెండు రూపాయిల నోటుంది.

''ఏంటి?''

''నా దగ్గర రెండు రూపాయిలున్నాయి సార్''

''అయితే''

''మా అమ్మ చావుబతుకుల్లో వుంది సార్''

''అయితే నన్నేం చేయమంటావయ్యా''

''చనిపోయేముందు తిరుపతి లడ్డూ తినాలని మా అమ్మ చివరి కోరిక సార్. కాని నా దగ్గర రెండు రూపాయిలే వున్నాయి సార్. దయతలచి మీరొక రూపాయి ఇస్తే...'' ఏడుస్తున్నట్టుగా మొహం పెట్టాడు ముత్యాలు.

ఎక్కడ తాకాలో అక్కడ తాకింది దయాసాగర్ రావుకు. మారు మాటాడకుండా జేబులోంచి ఏకంగా ఓ రూపాయి తీసి ఇచ్చాడు.

* * *

ఆ రాత్రికి లెక్క చూసుకుంటే పీరిగాడి కలెక్షన్ కేవలం ఒక రూపాయి అయితే పెంటడిది మూడు రూపాయిలు! ముత్యాలు కలెక్షన్ అక్షరాలా పదిహేను రూపాయిలు!!

ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన మినీకథ వివరాలు దిగువ యిచ్చిన కూపన్‌లో నింపి, పోస్టుకార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

—ఎడిటర్

ఈ సంచికలో నాకు నచ్చిన మినీకథ...............................................

రచయిత/రచయిత్రి...............................................

పేజీ నంబరు: ______________________